కథా కౌముది

# స్నేహం

జె.యు.బి.వి.ప్రసాద్

సుష్మా, ఆనంద్‌లు ఇద్దరూ బాగా చదువుకున్నవారే! సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు వెలగ బెడుతున్న వారే!

భార్యాభర్తలయ్యాక అందరి లాగే అప్పుడప్పుడూ దెబ్బలాడుకునే వారే! ఆ తర్వాత రాజీ పడి, నాలుగు రోజులు 'హాయిగా' కలిసి వుంటున్న వారే!

ఆ రోజు, తమ కంపెనీల నుంచి కొంపకు చేరుకున్నాక, "దెబ్బలాడుకుని చాలా రోజులయింది. ఇవాళ ఆ పని చెయ్యాలి" అని ఒకరి కొకరు చెప్పేసుకున్నారు.

అంతే! కంపెనీలో పడ్డ శ్రమని మర్చిపోయి, కొత్త ఉత్సాహం తెచ్చేసుకుని, గబ గబా పనులలో పడ్డారు.

పనులంటే, ఏవీ లేవు. వంటా, శుభ్రం, స్నానాలూ, తినడం, మళ్ళీ శుభ్రం, వగైరా! పిల్లలు లేకపోవడం వల్ల, ఆ పనులేవీ లేవు!

హాయిగా సోఫాలో కూర్చుని, "నువ్వు మొదలెట్టు! నాకు కాస్త భుక్తాయసంగా వుంది!" అన్నాడు ఆనంద్.

కొంచెం ఆవలించింది సుష్మ. ఆ తర్వాత తలాడించింది. ఆ పైన, కాస్త ఆలోచించింది కూడా.

"ఆ(, అన్నట్టు, నీ స్నేహితులలో బెస్ట్ ఎవరూ?" అనడిగింది.

"ఒక్కరంటే ఏం చెప్పను? ఇద్దరు, ముగ్గురు వున్నారు!" అన్నాడు గొప్పగా ఆనంద్.

"అబ్బ! అది సరే! ఆ ముగ్గురిలో, లేదా ఇద్దరిలో, ఒకరి పేరు చెప్పు" అంది.

"సరే! ప్రభాకర్, అందరి లోకీ బెస్ట్. నాతో అభిమానంగా వుంటాడు. ఎక్కువ స్నేహంగా వుంటాడు."

"అంత మంచి వాడా ఆ ప్రభాకర్?" అడిగింది అనుమానిస్తూ.

సుష్మకి ప్రభాకర్ బాగానే తెలుసు.

"ఓ! చాలా చాలా మంచి వాడు! చెప్పలేనంత మంచి వాడు!" అన్నాడు ఆనంద్.

దెబ్బలాట ఇప్పుడు 'స్నేహితుల' గురించి జరగ బోతోందని ఆనంద్‌కి అర్థం అయిపోయింది. ఉత్సాహం పెరిగింది కూడా.

"మరే! నోరు తెరిస్తే మీ ప్రభాకర్ నోటి నిండా అబద్ధాలే! మళ్ళీ మంచివాడట!" అని ఈసడించింది సుష్మ.

తెల్లబోయాడు ఆనంద్!

"అదేంటీ? అలా అనేశావేంటీ? వాడెంత మంచి వాడూ! నా కెన్ని సాయాలు చేశాడూ!" అంటూ వెనకేసుకు వొచ్చాడు తన నేస్తాన్ని.

"సాయాలు చేయలేదన్నానా నేను? అబద్ధాలు చెపుతాడన్నాను గానీ!" అంది వివరంగా ఈమె.

"అయితే అబద్ధాల్ని నిరూపించు!" అంటూ ఛాలెంజ్ చేశాడు ఆనంద్.

వెంటనే తన ఫోన్ తీసింది. "ప్రభాకర్ ఫోన్ నెంబర్ చెప్పు" అంది.

చెప్పాడు ఆనంద్.

ఫోన్ మోగింది.

"హలో!" అన్నాడు ప్రభాకర్ అవతల వేపు నించీ.

"ప్రభాకర్ గారూ! నేను సుష్మని మాట్లాడుతున్నాను. ఆనంద్ భార్యని" అంది సున్నితంగా.

"ఓ! సుష్మ గారా? చెప్పండి?" అన్నాడు ప్రభాకర్.

"ఒక గంట నించీ ఆనంద్ కోసం చూస్తున్నాను. ఇంటికి రాలేదు ఇంకా. ఫోన్ చేస్తే ఎత్తడం లేదు. నాకు చాలా కోపంగా వుంది. సినిమాకి వెళ్ళాలని కూడా అనుకున్నాము. ఒకవేళ అతనెక్కడ వున్నాడో మీకు తెలుసేమో నని ఫోన్ చేశాను" అంది గొంతు లోకి కొంచెం కోపాన్ని తెచ్చుకుంటూ.

అవతల వేపు కొన్ని క్షణాల నిశ్శబ్దం! ఆనంద్ శ్రద్ధగా వింటున్నాడు సంభాషణని స్పీకర్ ఆన్ చేసిన ఫోను నుంచి.

"ఉన్నాడండీ! చాలా సేపట్నించీ నాకేదో ప్రోగ్రాం నేర్పిస్తున్నాడు. ఇప్పుడు బాత్‌రూమ్‌కి వెళ్ళాడు. రాగానే మీకు ఫోన్ చేయమంటాను. ఫోనులో ఛార్జి అయిపోయినట్టుంది. చూసుకున్నట్టు లేదు. నా ఛార్జర్ ఇస్తాను" అన్నాడు ప్రభాకర్.

సుష్మ ఫోన్ పెట్టేసింది.

వెంటనే ఆనంద్ వేపు తిరిగి, "ఇప్పుడేమంటావు? అబద్ధాల మనిషి నీ స్నేహితుడు!" అంది నవ్వుతూ.

ఆనంద్ కళ్ళల్లో ఆనంద భాష్పాలు! నెమ్మదిగా తుడుచు కున్నాడు.

"ఏమయింది?" అని నవ్వుతూనే అడిగింది సుష్మ.

"స్నేహితుడంటే వాడే! చూడు, నన్ను నీ నించీ రక్షించాలని అబద్ధం కూడా చెప్పాడు! అదీ అసలైన స్నేహమంటే!" అన్నాడు సంతోషంగా.

ఈ లోపల, ఆనంద్ ఫోనుకు ఏదో మెసేజ్ వచ్చింది. చూసుకున్నాడు దాన్ని. "911" అని మాత్రమే వుంది.

"ఏమిటీ?" అన్నట్టు చూసింది సుష్మ.

"ప్రభాకర్ నించి కోడ్ మెసేజ్! '911' అని పంపాడు. అంటే, ఎమర్జెన్సీ అని అర్థం. నువ్వు వింటూ వుండు" అని ఫోన్ నొక్కాడు ప్రభాకర్ నంబర్‌కి.

అవతల వేపు నించి ప్రభాకర్ గొంతు వినగానే, "ఏంటీ ఎమర్జెన్సీ కోడ్ పంపావు?" అనడిగాడు.

"ఎక్కడున్నావురా? ఇందాక వదిన, అదే మీ ఆవిడ, ఫోన్ చేసింది. కోపంగా వుంది. నీ కోసం చూస్తోంది. వెంటనే వదినకి ఫోన్ చెయ్యి. నా దగ్గిరే, బాత్‌రూమ్‌లో వున్నావనీ, ఇప్పటి వరకూ నాకేదో ప్రోగ్రాం నేర్పిస్తున్నావనీ చెప్పాను" అన్నాడు ప్రభాకర్.

"అలాగే! ఫోన్ పెట్టెయ్యి" అన్నాడు ఆనంద్.

"ఇంకొక్క మాటరా! నువ్వెక్కడున్నా సరే, మా వదినకి అన్యాయం మాత్రం చేయకురా!" అని చెప్పి, ఫోన్ పెట్టేశాడు ప్రభాకర్.

ఇప్పుడు, సుష్మ కళ్ళలో కూడా ఆనంద భాష్పాలు!

@@@###@@@

COMMENTS